క్లుప్తంగా

నేడు నులిపురుగుల నివారణ దినోత్సవం

కురిచేడు(దొనకొండ): నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 10న కురిచేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 1–5లోపు అంగన్‌వాడీ కేంద్రాల్లో, 6–19 సంవత్సరాల్లోపు బాల బాలికలకు పాఠశాలలు, కళాశాలల్లో నులి పురుగు నివారణ మాత్రలు అందజేయనున్నట్లు వైద్యాధికారి ప్రవీణ్ తెలిపారు. బడి బయట పిల్లలను గుర్తించి ఆశా కార్యకర్తలతో ఈ మాత్రలు అందజేస్తామని ప్రవీణ్ పేర్కొన్నారు.

వివాదాస్పద భూమి పరిశీలన



గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్ చిరంజీవి

పుల్లలచెరువు: మండలంలోని సిద్దనపాలెం సర్వే నంబర్‌లో 296లో అవకతవకలు జరిగాయని, దీనిపై విచారించాలని గ్రామస్తులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇన్‌చార్జి తహసీల్దార్‌గా చిరంజీవిని నియమించి విచారణ చేయాల్సిందిగా అధికారులు ఆదేశించారు. అధికారుల ఆదేశాలపై తహశీల్దార్ ఆదివారం విధుల్లో చేరి అనంతరం సిద్దంపాలెంలోని సర్వే నెంబర్ 296పై గ్రామంలో విచారణ చేసినట్లుగా ఆయన తెలిపారు. గ్రామంలో పర్యటించి, గ్రామస్తులతో మాట్లాడి విచారణ చేసిన అన్ని విషయాలను కలెక్టర్‌కు నివేదిస్తామని పేర్కొన్నారు.

మిర్చి ధరలు నేలచూపులు

- భారీగా తగ్గిన మిర్చి ధరలు
- క్వింటాకు రూ.5 వేలు తగ్గుదల
- దిగజారిన ధరలతో లబోదిబోమంటున్న రైతులు
- పెట్టుబడులు సైతం రావడం గగనమే



కల్లాల్లో ఆరబోసిన మిరపకాయలు

దొనకొండ: రైతులకు నాలుగేళ్ల పాటు లాభాలు తెచ్చిపెట్టిన మిర్చి సాగు ఈ ఏడాది రైతులను నట్టేట ముంచింది. ఒక్కసారిగా ధరలు నేలచూపులు చూడటంతో రైతులకు కనీసం పెట్టుబడులు సైతం వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో మిర్చి సాగు చేసిన రైతులు లబోదిబోమంటున్నారు.

భారీగా పెరిగిన పెట్టుబడులు..

గతంతో పోలిస్తే ఈ ఏడాది మిర్చి సాగుకు పెట్టుబడులు భారీగా పెరిగాయి. కూలీ ధరలతో పాటు, కోత ఖర్చులు, తెగుళ్ల నివారణకు పురుగుమందుల వివరాలు, ఇతర ఖర్చులు పెరగడంతో పెట్టుబడులు భారీగా పెరిగాయి. ప్రస్తుతం గత నెల నుంచి మిర్చి కోతలు ప్రారంభమయ్యాయి. కేవలం కోతలకే ఎకరాకు రూ.50 వేల వరకు ఖర్చవుతోంది. ఇక పురుగుమందులు, నారు, ట్రాక్టర్ ఖర్చులు వగైనా మరో రూ.లక్ష వరకు ఖర్చయింది. దొనకొండ మండలంలో సుమారు 650 ఎకరాలు, దర్శిలో 550 ఎకరాలు, ముండ్లమూరులో 300 ఎకరాలు, తాళ్లూరు 40 ఎకరాలు, కురిచేడులో 850 ఎకరాల్లో మిర్చి సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

ధరలు దిగజారి..

గత నాలుగేళ్లుగా గుంటూరు యార్డులో కనిష్ట ధర రూ.17 వేల నుంచి గరిష్ట ధర రూ.22 వేల వరకు పలికింది. ఈ ఏడాది ఒక్కసారిగా ధర రూ.12 వేలకు పడిపోయింది. కొన్ని ప్రాంతాలకు రూ.10 వేలకు సైతం ధర దిగజారింది. దీంతో క్వింటాకు రూ.5 నుంచి రూ.7 వేల వరకు ధర దిగజారడంతో రైతులకు పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. ఓ పక్క పెరిగిన పెట్టుబడులు, తెగుళ్ల వెంటాడినా..ఇప్పుడు దిగజారిన ధరలతో ఏం చేయాలో తెలియక రైతులు తల్లడిల్లుతున్నారు.

5 ఎకరాలు సాగు చేసి అప్పుల పాలయ్యాను:



ఏటా 5 ఎకరాల్లో మిర్చి సాగు చేస్తాను. గత నాలుగేళ్ల నుంచి మిర్చికి నాణ్యమైన ధర ఉండటంతో లాభాలు పొందాం. ఈ ఏడాది నాణ్యమైన ధర వస్తుందని ఆశ పడ్డాం. గుంటూరు మార్కెట్ యార్డులో ధర డీలా పడింది. పెట్టుబడులు కూడా వచ్చే అవకాశం సన్నగిల్లింది.

– చెన్నుబోయిన గురుమూర్తి, రుద్రసముద్రం

పెట్టిన ఖర్చులు వచ్చే అవకాశాలు సన్నగిల్లాయి:



3 ఎకరాలు సాగు చేశాను. మూడున్నర లక్ష ఖర్చు అయింది. ఈ ఏడాది రూ.12 వేలు క్వింటా ధర పలుకుతుంది. గత ఏడాది రూ.20 వేల వరకు క్వింటా ధర పలికింది. ఈ ఏడాది వ్యవసాయం కలిసి రాలేదు. అప్పులే మిగిలాయి.

– టి.పాపిరెడ్డి, ఇండ్లచెరువు

పూజలలో పాల్గొన్న బూచేపల్లి



బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్ రెడ్డిని సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

తాళ్లూరు: మండలంలోని తూర్పు గంగవరంలో గుంటి గంగమ్మ తల్లి అమ్మవారి సన్నిధానంలో నూతనంగా నిర్మించుచున్న జై భీమ్ మాలల అన్నదాన సత్రం శ్లాబును వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మలు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ముందుగా జై భీమ్ మాలల కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు.

అనంతరం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు కార్యక్రమంలో కమిటీ సభ్యులు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించండి



వీడ్కోలు పలుకుతున్న విద్యార్థులతో స్కూల్ సిబ్బంది

యర్రగొండపాలెం: విద్యార్థులు మహోన్నత బాటకు ముందడుగు వేసే సమయం ఆసన్నమైందని, ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్ అన్నారు. స్థానిక త్రిపురాంతకం రోడ్డులో ఉన్న రెయిన్‌బో హైస్కూల్‌లో జరిగిన టెన్త్ విద్యార్థుల వీడ్కోలు సభలో ఆయన మాట్లాడారు. పదో తరగతి విద్యార్థుల జీవితాలను మార్చివేస్తుందని, ఏం చేయాలన్న ఆలోచన రేకెత్తిస్తుందన్నారు. పదో తరగతిలో మంచి మార్కులు సాధించి ఉన్నత శిఖరాలను అధిష్టించాలని ఆయన కోరారు. అనంతరం ఎంఈఓలు పి.ఆంజనేయులు, మల్లా నాయక్‌లను ఆయన సన్మానించారు. కరస్పాండెంట్ కిషోర్ గౌడ్, ప్రిన్సిపాల్ నిఖిల కిరణ్ పాల్గొన్నారు.

నరసింహస్వామికి విశేష పూజలు



తోకపల్లిలో నాగమయ్యపుట్టకు నైవేద్యం సమర్పిస్తున్న మహిళలు



భారతకోలాటం నృత్యం చేస్తున్న యువకులు

పెద్దారవీడు: మండలంలో తోకపల్లిలో సద్గురు యోగానంద నరసింహస్వామి, 69వ పుట్ట తిరునాళ్ల సందర్భంగా ఆదివారం ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు భవానీ ప్రసాద్ ఆధ్వర్యంలో స్వామికి పంచామృతాభిషేకం, అలంకరణ పూజ, మంత్రపుష్ప నీరాజనం, ప్రసాద వినియోగం, తదితర పూజలు చేశారు. స్వామి చిత్రపటానికి ప్రత్యేకంగా అలంకరించి ట్రాక్టర్‌పై ఆశీనులై వీధుల్లో మేళతాళాలు, డప్పువాయిద్యాలతో ఊరేగింపు చేశారు. ఊరేగింపులో మహిళలు చలిపిండి, మొలకెత్తిన సజ్జలు, పండ్లు, పాలు, పసుపు, కుంకమ, కాయకర్పూరంతో బయలుదేరి ఆలయంలో వెలసిన నాగమయ్య పుట్టకు సమర్పించారు. చుట్టుప్రక్కల గ్రామాల నుంచి భక్తులు స్వామిని దర్శించుకొని, మొక్కుబడులు చెల్లించి తీర్థప్రసాదాలు అందుకున్నారు. దాతల సాయంతో భక్తులకు మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం శ్వేత కోలాటం బృందంచే భక్తి పాటలతో భారత కోలాటం నృత్యం చేశారు. శనివారం రాత్రి భక్తుల కాలక్షేపానికి భక్తప్రహ్లాద నాటకం ప్రదర్శించారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం మోటార్ సైకిల్ స్లో పోటీలను గ్రామస్తులు నిర్వహించారు. రేగుమానిపల్లి గ్రామానికి చెందిన గంగిరెడ్డి లాలారెడ్డి మొదటి స్థానం, రెండో స్థానంలో ఎర్రగొండపాలెం మండలం అమనిగుడిపాడు గ్రామానికి చెందిన చిట్యాల వెంకటేశ్వరరెడ్డి, మూడోస్థానంలో గోసు భార్గవ్ నిలిచారు. వారికి ఫణీంద్ర చక్రవరి రూ.6 వేలు, బాణాల పవన్‌కుమార్‌యాదవ్ రూ.4 వేలు, నరాల భార్గవి రూ.2 వేలు విజేతలకు అందజేశారు. పోటీలకు న్యాయ నిర్ణేతలు సొంటి నాగార్జునరెడ్డి, జిల్లెల చెన్నారెడ్డి, మేకల బాలసుబ్రహ్మణ్యం, తిమ్మారెడ్డి, నాగలక్ష్మిరెడ్డి వ్యవహరించారు.

నరసింహస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే తాటిపర్తి



తోకపల్లిలో నరసింహస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

పెద్దారవీడు: మండలంలో తోకపల్లిలో సద్గురు యోగానంద నరసింహస్వామి తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా శనివారం రాత్రి వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ నరసింహస్వామికి ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. అలాగే గ్రామంలో శనివారం ఉదయం వైఎస్సార్ సీపీ నాయకుడు జాజుల శ్రీరాములు గుండెనొప్పితో మృతి చెందారు. మృతుని భార్య రామకోటమ్మను, కుటుంబసభ్యులను పరామర్శించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలతో కొద్దిసేపు మాట్లాడుతూ గ్రామంలోని సమస్యలు, పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి, సర్పంచులు జిల్లెల మల్లీశ్వరీ, పాలగిరి రామాంజనేయులరెడ్డి, అంగిరేకుల ఆదినారాయణయాదవ్, నాయకులు మేకల కాశయ్యయాదవ్, సొంటి తిమ్మారెడ్డి, సొంటి వెంకటేశ్వరరెడ్డి, మూల సత్యంరెడ్డి, తోకల ఆవులయ్య, షేక్ బుజ్జి, సోషల్ మీడియా కో కన్వీనర్ ఏర్వ మల్లికార్జునరెడ్డి, కార్యకర్తలు ఉన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



చెంచులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్యాధికారులు

యర్రగొండపాలెం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అప్పుడే ఆరోగ్యంగా ఉంటారని ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ అనీల్‌కుమార్ అన్నారు. మండలంలోని ఇష్టకామేశ్వరి చెంచుగూడెంలో జరిగిన ఉచిత వైద్యశిబిరంలో ఆయన మాట్లాడారు. తాము నివశిస్తున్న ప్రాంతాల్లో నిల్వ ఉన్న మురికినీటిలో దోమలు చేరి హాని కలిగిస్తాయని, వీటి వల్ల సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా 25 చెంచు కుటుంబాలకు పరీక్షలు చేసి ప్రధానమంత్రి జన ఔషధి మెడికల్స్ వారు అందించిన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శివానంద్, కృష్ణారెడ్డి, ఏఓ సుధీర్, జన ఔషధి నిర్వాహకుడు గోపి సాయి పాల్గొన్నారు.

శుభకార్యాలకు హాజరైన బూచేపల్లి



మోహన్‌బాబు కుమార్తె నామకరణానికి హాజరైన బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దర్శి: పట్టణంలోని ఒకటో వార్డు కౌన్సిలర్ జగన్నాథం మోహన్‌బాబు కుమార్తె నామకరణం కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ హాజరయ్యారు. చిన్నారిని అక్షతలు వేసి ఆశీర్వదించారు. పొదిలిరోడ్డు ఈసీఆర్ వెంచర్‌లో జడ్డు శ్రీనివాసరెడ్డి నూతన గృహప్రవేశానికి హాజరయ్యారు. పార్టీ కార్యకర్త పంటా సుబ్బారెడ్డి కుమార్తె ఓణీల వేడుకలకు హాజరయ్యారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కురిచేడు(దొనకొండ): కురిచేడులో దర్శి నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు పి.సాంబశివరావు కుమార్తె వెంకట నాగ కనిష్క శుభకార్యానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి హజరయ్యారు. జెడ్పీటీసీ నుసుం నాగిరెడ్డి, మండల కన్వీనర్ యన్నాబత్తుల వెంకటసుబ్బయ్య, వీరగంధం కోటయ్య, బి.వెంకటనరసయ్య, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కండె గంగయ్య, ఏరువ పిచ్చిరెడ్డి, ఏరువ సుబ్బారెడ్డి, ఆవుల వెంకటరెడ్డి, నుసుం ప్రతాపరెడ్డి, నిమ్మకాయల రాజయ్య పాల్గొన్నారు.

పట్టించుకోండి ప్లీజ్..!

- పైపులు పగిలి వృథాగా రోడ్లపై పారుతున్న నీరు
- దుకాణదారులకు తప్పని ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు



పగిలిన పైపుల నుంచి వస్తున్న నీటితో బురదమయంగా మారిన ప్రధాన రహదారి

తాళ్లూరు: మండలంలోని తూర్పు గంగవరం గ్రామంలో దర్శి–చీమకుర్తి ప్రధాన రహదారిలో డీప్ బోర్ పైపులైన్ పగిలిపోయి నీరు వృథాగా పోతున్నాయి. గతంలో కాలువల కూడికతీత పేరుతో జేసీబీ సాయంతో కాలువలోని పూడిక తీశారు. ఆ సమయంలో డీప్‌బోర్ పైపులైన్లు పగిలిపోయాయి. పైపులైన్లు పగిలిపోవడంతో డీప్ బోర్ మోటార్ వేసిన సమయంలో నీరు వృథాగా రోడ్లపైకి చేరుతుంది. పైపులు పగిలి మూడు నెలల నుంచి నీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. రానున్నది వేసవి కాలం. నీటి కొరత ఏర్పడే సమయంలో కూడా నీటి వృథా విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామ ప్రజలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నారు. రోడ్లపైకి నీరు చేరి బురదగా ఉండడంతో దుకాణాలకు కష్టమర్లు రావడం లేదని దుకాణదారులు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీరు రోజుల తరబడి నిల్వ ఉండటంతో దోమలు చేరి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలలుగా ఇదే సమస్య ఉన్నా సమస్య గురించి పట్టించుకోకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు.



పైపుల నుంచి బయటికి వస్తున్న నీరు

ఎవ్వరూ పట్టించుకోవడం లేదు



పైపులు పగిలి నీరు రోడ్లపైకి చేరుతోంది. చాలా రోజుల నుంచి సమస్య ఉన్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. నీరు రోడ్లపైకి చేరడంతో కొనుగోదారులు దుకాణాల్లోకి రావాలంటే ఇబ్బంది పడుతున్నారు. దీంతో వ్యాపారం దెబ్బతింటుంది. అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేయాలి.

– నాగేశ్వరరావు, దుకాణదారుడు

మరమ్మతులు చేయాలి



దుకాణాల ముందు నీరు నిలిచి బురదమయంగా మారుతుంది. దీంతో కొనుగోలుదారు దుకాణాలకు రాకుండా వెనక్కి వెళ్లిపోతున్నారు. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేస్తే బాగుంటుంది.

– రవి

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా చిరంజీవి

పుల్లలచెరువు: ఇన్‌చార్జి తహసీల్దార్‌గా చిరంజీవిని జిల్లా అధికారులు నియమించారు. ఆయన ఆదివారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలను సాధ్యమైనంత వరకు పరిష్కరిస్తామన్నారు. రికార్డులను వీఆర్‌ఓలు సక్రమంగా నిర్వహిస్తూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు.

గంగాభవానీకి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గుంటి గంగ అమ్మవారు

తాళ్లూరు: మండలంలోని తూర్పు గంగవరం పంచాయతీ సోమవరప్పాడు గ్రామ పరిధిలో ప్రముఖ పుణ్యక్షేత్రంలో వేంచేసిన గంగాభవానికి అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు విజయలక్ష్మి, బాలరాజు కామేశ్వర శర్మ, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయంలోని మల్లికార్జున స్వామి, నాగమ్మతల్లి విగ్రహాలను పూజించారు. ఆలయ చైర్మన్ కె. గురుబ్రహ్మం, ఈఓ గుంటపల్లి వాసు పర్యవేక్షించారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉరుసు మహోత్సవాలు

పెద్దారవీడు: మండలంలో దేవరాజుగట్టు గ్రామంలో వెలసిన హజరత్ సయ్యద్ హనీఫ్ షాఖాద్రి ఉరుసు మహోత్సవాలు మంగళ, బుధ, గురువారాల్లో నిర్వహించనున్నట్లు దర్గా పీఠాధిపతి సయ్యద్ తాజ్‌హుస్సేన్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. మంగళవారం గుసూల్ ముబారక్ కార్యక్రమం ప్రారంభం, బుధవారం సాయంత్రం 6 గంటలకు జెండాల ఉత్సవం, గంథోత్సవం, సాయంత్రం అన్నదానం, గురువారం సాయంత్రం 6 గంటలకు దీపారాధన, ప్రార్థనలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.